క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: చెట్ల నరికివేత కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు శశిధర్‌రెడ్డి, పవన్‌చందులు తెలిపారు. కండ్లకోయ సబ్ స్టేషన్, బండమాదారం సబ్ స్టేషన్ పరిధిలో అన్ని పరిశ్రమలకు, డొమస్టిక్, అగ్రికల్చర్ సర్వీసులకు, కేవీ రెడ్డి నగర్, అంతెమ్ విల్లాస్, ప్రెస్టేజీ పార్క్, బర్మాజీగూడ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని వారు తెలిపారు.

నేటి నుంచి 'టెక్ ఫార్మా సంపతి'

ఘట్‌కేసర్: చౌదరిగూడలోని నల్లా నర్సింహారెడ్డి విద్యా సంస్థలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జాతీయ స్థాయి టెక్ ఫార్మా సంపతిని నిర్వహించనున్నట్లు కళాశాల కార్యదర్శి సీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. టెక్ సంపతిలో పేపర్, ప్రాజెక్ట్ ప్రజెంటేషన్లతో పాటు క్రీడలు నిర్వహిస్తామన్నారు.

'కానో' చెట్లను తొలగించాలని వినతి


వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: ఆక్సిజన్ ఇవ్వని కానో కార్పస్ చెట్లు మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో అధికంగా ఉన్నాయని, వాటిని తొలగించి వాటి స్థానంలో వేరే రకాల మొక్కలను నాటాలని పట్టణ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మనుషులకు ఉపయోగపడని కానో చెట్లను తొలగించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, శ్రీకాంత్, రాజు, వంశీ వంజరి, హేమలతారెడ్డి, వంశీరెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత


వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు ఇస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: చౌదరిగూడలోని లహరి వృద్ధాశ్రమంను ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులతో మాట్లాడి వారికి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆశ్రమానికి అవసమైన నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభంజన్, మహిపాల్‌రెడ్డి, బాలుయాదవ్, దామోదర్‌రెడ్డి, స్వప్న, కవిత, అనిత, సునీత, ఆశ్రమ నిర్వాహకురాలు రాధిక పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యం


ఏసయ్య, భరోసా పార్టీ అధ్యక్షుడు

ఘట్‌కేసర్: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం, పేదరికం నిర్మూలనే భరోసా పార్టీ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ అధ్యక్షుడు చింతల ఏసయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోని పేదరికంతో ప్రశాంతత కరువైందని, విద్య, వైద్యం మోయలేని భారమైందన్నారు. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని, ఇప్పటికే 15 నియోజకవర్గాల నుంచి పోటీ చేసే అభ్యర్థులు పేర్లు ఖరారు చేశామన్నారు.

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఇబ్బంది

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్

బోడుప్పల్: టీఆర్ఎస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో బోడుప్పల్‌లో 7 వేల కుటుంబాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్ అన్నారు. బోడుప్పల్ గాంధీ విగ్రహం వద్ద వక్ఫ్ బోర్డ్ బాధితుల ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రికార్డులను పరిశీలించకుండా అన్యాయం చేస్తోందని, ప్లాట్ల యజమానులు ఉద్యమం చేస్తూ, న్యాయబద్ధంగా కోర్టుకు వెళ్లి సాధించుకోవాలన్నారు. 1954 సంవత్సరం నుంచి 70 ఏళ్లుగా ఉన్న హక్కును కాలరాస్తున్నారన్నారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీజేఎస్ ప్రతినిధులు మారం లక్ష్మారెడ్డి, భద్రం, సురేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాధవి, కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్‌రెడ్డి, పోగుల నర్సింహరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ సంఘీభావం తెలిపారు. దీక్షలో మీనాక్షి, స్వరూప, విజయ, వినోద, శ్యామల, శ్రీవాణి, బృధవని, సులోచన నర్మద, సరిత కూర్చున్నారు.



నారీ.. నీకు వందనం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మేడ్చల్ నియోజకవర్గంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను పలు స్వచ్ఛంద సంస్థలు, సంక్షేమ, సేవా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. మహిళలు వంట గదికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని, ప్రపంచంలో మహిళల కన్నా మరో గొప్ప శక్తి లేదని అభివర్ణించారు.

- మేడ్చల్ నియోజకవర్గంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలకు సన్మానం.. సత్కారం
- మున్సిపాలిటీల్లో సంబరాలకు అడ్డొచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్


నాగారం మున్సిపాలిటీ 7 వార్డులో...

కండ్లకోయలో...
మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలో వార్డు కౌన్సిలర్ హంసరాణి కృష్ణగౌడ్ వార్డు మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. తోటి మహిళలకు పసుపు, కుంకుమలు వాయినాలుగా ఇచ్చారు. మేడ్చల్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో మహిళా ఉపాధ్యాయులు, సిబ్బందిని సన్మానించి పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రేమ్‌కుమార్, నాగేశ్వర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సంబరాలకు అడ్డొచ్చిన ఎన్నికల కోడ్..
ప్రపంచమంతా మహిళా దినోత్సవ వేడుకలు అంబరాన్నంటేలా జరగగా మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో కనిపించలేదు. మున్సిపాలిటీల్లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలు జారీ చేసినా ఎక్కడా సంబరాలు కనబడ లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున రెండు మున్సిపాలిటీల్లో సంబరాలను నిర్వహించలేదని కమిషనర్ రాములు తెలిపారు.

నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో...
కీసర: నాగారం మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ గూడరు సబితా ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలో కాలనీలకు చెందిన మహిళల సమక్షంలో కేక్‌కట్ చేశారు. ఇక దమ్మాయిగూడ మున్సిపాలిటీలో కౌన్సిలర్ పాండాల అనురాధయాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోధుమకుంట గ్రామపంచాయతీ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. అదేవిధంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీకి చెందిన మహిళా కౌన్సిలర్లు కొందరు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి మల్లారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

అనురాగ్ యూనివర్సిటీలో...
ఘట్‌కేసర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని బుధవారం వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో నీలిమా ఆస్పత్రి సహకారంతో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో ఏయూ వీసీ రాంచంద్రం, రిజిస్ట్రార్ ఫాతిమా, సీఈఓ నీలిమా, మహిళా డీన్‌లు, హెచ్‌ఓడీలో, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బంధన్ ఫంక్షన్ హాల్‌లో...
అతివలు మగవారితో సమానంగా అన్నింట్లో ముందుండాలని ఘట్‌కేసర్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. పట్టణంలోని బంధన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో కౌన్సిలర్లతో కలిసి కేట్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ పారిశుద్ధ్య మహిళా కార్మికులుగా ఎంపికైన నలుగురిని సన్మానించారు. అనంతరం పారిశుద్ధ్య మహిళా కార్మికులకు చీరలు అందజేశారు. కౌన్సిలర్లు రమాదేవి, అనురాధ, నాగజ్యోతి, శశికళ, డ్వాక్రా మహిళలు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

కొర్రెముల్‌లో...
మహిళా దినోత్సవాన్ని కొర్రెముల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య మహిళా కార్మికులను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. వార్డు సభ్యులు ఈశ్వరీ, భార్గవి, లక్ష్మీ, దుర్గరాజ్, బాబు, నాయకులు యాదగిరి, మన్నెం, నాగేశ్ పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి, కండ్లకోయలో...
మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వ్యక్తిత్వ నిపుణులు శ్రీమిత్ర, నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో పారిశ్రామికవేత్త ఉషారాణి, యాంకర్, శారద ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుజాత బూర్ల, ఎమ్మార్ఐటీఎస్ కళాశాలలో ప్రొఫెసర్ శ్రావణిలు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థినులు, మహిళా అధ్యాపకులతో కలిసి కేక్ కట్ చేశారు. కండ్లకోయలోని సీఎంఆర్‌టీసీ కళాశాలలో పారిశ్రామికవేత్త రూపాలి మహిళా దినోత్సవ వేడుకలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆయా కళాశాలల కార్యదర్శులు టీవీ రెడ్డి, త్రిశూల్‌రెడ్డి, వసంతలత, ప్రిన్సిపాల్స్ శ్రీలత, లోకనాథం, రవీంద్ర, రాజిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోచారం మున్సిపల్ కార్యాలయంలో...
పోచారం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోచారం మున్సిపల్ కార్యాలయంలో మహిళలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అన్నోజిగూడ డ్వాక్రా భవనంలో నిర్వహించిన వేడుకల్లో చైర్మన్ కొండల్‌రెడ్డి, రాజీవ్ గృహకల్ప కాలనీలోని 9వ వార్డులో కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి, 7వ వార్డులో కౌన్సిలర్ ఆకిటి శైలజ ఆధ్వర్యంలో, 3వ వార్డులో కౌన్సిలర్ చింతల రాజశేఖర్, ఎల్‌ఐజీ కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

భోగారం ఆరోగ్య ఉప కేంద్రం ఏఎన్ఎంకు అవార్డు
కీసర: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 27 మంది మహిళలకు ఉత్తమ పురస్కారాలతో పాటు రూ.లక్ష నగదును అందజేశారు. ఇందులో భాగంగా బుధవారం వరంగల్‌లో నిర్వహించిన వేడుకలో మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా కీసర మండలం భోగారం ఆరోగ్య ఉప కేంద్రంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న తుంగ ఇందిరా అవార్డుతో పాటు రూ.లక్ష ప్రోత్సాహక నగదుకు సంబంధించిన చెక్కును అందుకున్నారు. దీంతో కీసర పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సరితా హర్షం వ్యక్తం చేశారు.


మంత్రి మల్లారెడ్డితో మహిళా కౌన్సిలర్లు


మహిళలకు బొట్టుపెడుతున్న కౌన్సిలర్ హంసరాణి


కండ్లకోయలో కేక్ కట్ చేస్తున్న మహిళలు


కొర్రెముల్ పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం


మేడ్చల్ హాస్టల్‌లో చిన్నారులతో..


మంత్రి సత్యవతిరాథోడ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఏఎన్ఎం తుంగ ఇందిరా


పోచారంలో అంగన్‌వాడీ టీచర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ హరిమోహన్‌రెడ్డి


ఘట్‌కేసర్‌లో కౌన్సిలర్లతో కలిసి కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్


గోధుమకుంట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద...


సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో...


అనురాగ్ యూనివర్సిటీలో వైద్య పరీక్షలు చేస్తూ..


అన్నోజిగూడ డ్వాక్రా భవనంలో.. చైర్మన్ కొండల్‌రెడ్డి, కౌన్సిలర్ రాజశేఖర్


సీఎంఆర్‌టీసీ కళాశాలలో...


దమ్మాయిగూడ మున్సిపాలిటీలో...


నర్సింహారెడ్డి కళాశాలలో...


ఎమ్మార్ఐటీఎస్ కళాశాలలో...

కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించండి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

సాక్షి,మేడ్చల్ జిల్లా: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి గెలిపించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ పిలుపునిచ్చారు. అభ్యర్థి హర్షవర్ధన్ రెడ్డి గెలుపు కోసం ముద్రించిన కరపత్రాలు, స్టిక్కర్లు, ఉమ్మడి జిల్లాల పరిధిలోని పాఠశాల, గురుకుల, కళాశాలలో సోమవారం కల్లా చేరేలా కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని ఆయన కోరారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను మొదటి ప్రాధాన్యత ఓటుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి వేసేలా అభ్యర్థించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టిన వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయనున్నట్లు నందికంటి శ్రీధర్ తెలిపారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఉపాధ్యాయులకు సరైన సమయానికి పీఆర్సీ, డీఏలు అందజేయడంతో పాటు ప్రతి నెలా ఒకటవ తేదీన జీతాలు పడేలా కృషి చేస్తామన్నారు. కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేస్తామని, ఉపాధ్యాయుల పదోన్నతులను పునరుద్ధరించడంతో పాటు ప్రతీ ఏడాది ప్రతి ఒక్కరికి ప్రమోషన్ అండ్ బదిలీలు నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయుల ఆత్మ గౌరవానికి భంగం కలగకుండా కాంగ్రెస్ పార్టీ కాపాడుతుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు చంద్ర శేఖర్, జీడి శ్రీనివాస్‌గౌడ్, సీఎల్ యాదగిరి, అశోక్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, యాదగిరి, కృష్ణగౌడ్, సంతోష్ రెడ్డి, ఎస్.శ్రీనివాసులు, పవన్ కుమార్ పాల్గొన్నారు.

'విరాళంగా అందజేసిన సామగ్రి ఏమైంది?'


మాట్లాడుతున్న బీజేపీ నేతలు

కీసర: కీసర గ్రామ పంచాయతీ పరిధిలో శ్మశాన వాటిక అభివృద్ధికి కోఆప్షన్ సభ్యుడు చిత్తార్ల రమేష్ గౌడ్ రూ.5 లక్షల విలువ చేసే ఇసుక, కంకర, సిమెంట్ ,గ్రానైట్ రూపంలో ఇచ్చిన నిధులు దుర్వినియోగమైనట్లు వచ్చిన ఆరోపణలపై పంచాయతీ శాఖ ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కీసరలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కీసర కోఆప్షన్ సభ్యుడిగా నియమితులైన చిత్తార్ల రమేష్‌గౌడ్ కీసరలో నిర్మిస్తున్న శ్మశానవాటిక కోసం సుమారు రూ.5లక్షల విలువచేసే వివిధ నిర్మాణ సామగ్రిలను అందిచినట్లు ఓ బాండ్ పేపర్ మీద రాసి పంచాయతీ కార్యాలయానికి అప్పగించారని, ఇందుకు సంబంధించిన బిల్లులు కానీ, అధికారుల సమక్షంలో ఇచ్చినట్లు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. కానీ శ్మశాన వాటిక కోసం ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద సుమారు రూ.14 లక్షలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో పనులు చేపట్టారని, కోఆప్షన్ సభ్యుడు విరాళంగా అందజేసిన ఇసుక, కంకర, సిమెంట్ ఏమైందన్నారు. ఇట్టి విషయంలో వార్డు సభ్యుడు రామారం ప్రదీప్ విచారణ చేపట్టి వాస్తవాలను గ్రామస్తులకు తెలియజేయాలని ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తప్పు చేసిన వ్యక్తులకు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్న విషయాన్ని మరవద్దన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు నల్ల వెంకట్‌రెడ్డి, దానోళ్ల మల్లేష్, చంద్రమౌలి, అంజి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న హరివర్ధన్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘనాపూర్ సర్పంచ్ గోపాల్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, పేద మహిళలు, వృద్ధులకు బుధవారం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ హరివర్ధన్‌రెడ్డి, సర్పంచుల ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి సురేందర్ ముదిరాజ్, బీ-బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అనీత హాజర్రై అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవి, ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్, రేవంత్‌రెడ్డి టీం సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఓబీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగేశ్‌గౌడ్, సురేశ్, రాజు, అనిత, మమత, సత్తయ్య గౌడ్ పాల్గొన్నారు.

ఘోరం జరిగినా.. గొంతు మెదపలే..!

- నడిరోడ్డుపై భార్యను చంపుతున్నా పట్టించుకోని ఇరుగు పొరుగు వారు
- బిర్యానీ కోసం భార్యను హతమార్చిన మూర్ఖుడు
- పిల్లలు చెప్పేంత వరకు బయటకు రాని హత్యోదంతం



మేడ్చల్: కట్టుకున్న భార్యను కడతేర్చడానికి ఇంటి ముందు నడిరోడ్డుపై శానిటైజర్ పోసి నిప్పంటించినా విషయం 18 రోజుల పాటు గోప్యంగా ఉండటంతో సమాజం ఎటుపోతుందో అర్థం కాని స్థితిలో ఉంది. మేడ్చల్ పట్టణంలోని సూర్యనగర్ కాలనీలో గత నెల 18వ తేదీన నరేందర్ అనే వ్యక్తి పగటిపూట ఇంటిముందు ఉన్న రోడ్డులో తాను కన్న ఇద్దరు ఆడపిల్లలు చూస్తుండగా భార్య నవ్యశ్రీ వంటిపై శానిటైజర్ పోసి నిప్పటించిన విషయం విధితమే. నవ్యశ్రీ మృత్యువుతో 18 రోజుల పాటు పోరాడి ఈ నెల 6వ తేదీన మృతి చెందింది.

సమాజం తలదించుకునేలా...
మహిళలు అన్ని రంగాల్లో రాకెట్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నా ఆమెను అబలగా భావిస్తూ పురుష అహంకారంతో మగ పిశాచులు దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. నవ్యశ్రీని రోడ్డుపై చూస్తుండగానే 5 లీటర్ల శానిటైజర్ పైన పోసి నిప్పంటించాడు ఆ మృగాడు. ఎదో నిర్మానుష్య ప్రాంతంలోనో.. అటవీ ప్రాంతంలోనో.. ఘటన చోటు చేసుకోలేదు. అందరూ నివాసముండే కాలనీలో ఇళ్ల మధ్య చోటు చేసుకున్న ఘటన ఇది. ఇంత ఘోరం చోటు చేసుకున్న సమయంలో ఇరుగు పొరుగు వారు కనీసం స్పందించకపోవడం అందరిని తలదించుకునేలా చేస్తోంది. తమ ఇంటి పక్కన వారు కనీసం స్పందించకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇంటి ముందు రోడ్డుపైన ఓ మహిళ మంటల్లో తగలబడుతుంటే అడ్డుకున్న వారే కరువయ్యారు.

18 రోజుల పాటు ఎందుకీ మిస్టరీ..?
అందరూ చూస్తుండగానే భార్యను చంపే యత్నం చేసినా పోలీసులకు 18 రోజుల తర్వాత విషయం మృతురాలి పిల్లలు చెప్పేంత వరకు తెలియకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. పోలీసులు ప్రమాద కేసుగా నమోదు చేయడం మృతురాలి వాంగ్మూలం రికార్డు చేయడమే గానీ 18 రోజుల తర్వాత విషయం సీసీ ఫుటేజీ తర్వాత బయటకు రావడంపై పోలీసుల దర్యాప్తు తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కనీస విచారణ చేయకుండా ఎలా కేసు చేశారని మృతురాలి పిల్లల ఫిర్యాదు తర్వాత కేసును హత్య కేసుగా మార్చారు. బహిరంగంగానే మహిళపై దాడి చేసినా అది ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా పోలీసులు భావించి కేవలం మృతురాలు చెప్పిన మాటల ప్రకారం కేసు చేయడంలో పోలీసులు దర్యాప్తు ఎలా ఉందో స్పష్టమవుతుంది. కాగా ఘటన జరిగిన రోజు అంబులెన్స్‌లో నవ్యశ్రీని తరలించన సమయంలో ఇంటి పక్కన ఉన్న వారు జరిగిన ఘటన గురించి పోలీసులకు చెప్పినట్లు సమాచారం.

తల్లి బతుకుతుందేమోనని..
18 రోజుల పాటు మృత్యువుతో పోరాడిన నవ్యశ్రీ బతుకుతుందోమోననే ఆశతో వారి పిల్లలు మౌనంగా ఉండిపోయారు. తమ కళ్లెదుటే తమ తండ్రి తల్లిని చంపడానికి యత్నించడాన్ని చూసిన పిల్లలు చందన, మేఘన తమ తల్లి బతుదుందేమోననే ఆశతో మౌనంగా ఉండిపోయారు. ఫిబ్రవరి 18వ తేదీన ఘటన జరిగినా మార్చి 6వ తేదీ వరకు మౌనంగా ఉండిపోయారు. మార్చి 5 వ తేదీన తల్లి మరణించడంతో మార్చి 6వ తేదీన పీఎస్‌కు వెళ్లి తమ తల్లిపై తండ్రి చేసిన దాడిని పోలీసులకు వివరించారు.

బిర్యానీ తెచ్చిన తంటా...
భార్యాభర్తలు నవ్యశ్రీ, నాగేందర్‌లది కలహాల కాపురమే. వారు తరుచూ గొడవలు పడే వారని మూడు, నాలుగు నెలల క్రితమే సూర్యనగర్‌లో ఇల్లు కొనుగోలు చేసి కాలనీకి వచ్చారని కాలనీ వాసులు తెలిపారు. భార్యాభర్తలిద్దరూ తరుచూ గొడవ పడేవారని ఇరుగుపొరుగు వారు చెప్పారు. ఘటన జరిగిన రోజు శివరాత్రి పండగ కావడంతో నవ్యశ్రీ ఉపవాస దీక్షలో ఉంది. నిందితుడు నాగేందర్ పండగ రోజు మాంసాహార బిర్యానీ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి ఇంటికి పంపాడు. శివరాత్రి రోజు బిర్యానీ ఏంటని నవ్యశ్రీ ఆర్డర్‌ను వెనక్కి పంపింది. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఆమె భర్త కోపోద్రిక్తుడై భార్యతో గొడవపడి నిప్పంటిచే వరకు వెళ్లిందని సూర్యనగర్ కాలనీలో గుసగుసగా వినబడుతున్నాయి.